మౌలాలిలో సమస్యలను పరిష్కరించాలి



మౌలాలి: సికింద్రాబాద్ జోన్ పరిధిలో ఎదుర్కొంటున్న సమస్యలపై బుధవారం జోనల్ కమిషనర్ రవికాంత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. కార్యక్రమానికి మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ హాజరై మౌలాలి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను వివరించారు. డివిజన్ పరిధిలో తవ్వి వదిలేసిన రోడ్లు, పూర్తి కావాల్సిన నాలాలు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆమె కోరారు.

అమర జవాన్లకు నివాళి



అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో దేశం కోసం అమరులైన జవాన్ల సేవలను గుర్తు చేసుకున్నారు. మనం ఇక్కడ ప్రశాంతంగా ఉంటున్నామంటే అది మన జవాన్ల చలువేనన్నారు. మనలో దేశభక్తి ఉన్న విద్యార్థులు ఆర్మీలో చేరి దేశం కోసం సేవ చేయాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, మంగాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నేడు ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రవీంద్రరెడ్డి తెలిపారు.

హస్తం గూటికి గులాబీ శ్రేణులు



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

కాప్రా: కాప్రా డివిజన్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్పొరేటర్ స్వర్ణరాజ్ ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, ఎండీ అలీ, ప్రదీప్, సోమనాథ్, మధు, గజేందర్‌రావు, నరేందర్, నర్సింహ, శ్రీకాంత్, మహేష్, అనిత, శిరీష, సౌజన్య, వసంత, రూప, అంజమ్మ సహా దాదాపు 150 మంది కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు



మౌలాలి: జీహెచ్‌ఎంసీ ప్రతిస్పందన దళం(డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నేరేడ్‌మెట్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రెబెకా మన్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు నివాళి



కుషాయిగూడ: ఉగ్రవాదుల దాడిలో అమరులైన పుల్వామా అమర వీరులకు బుధవారం బజరంగ్‌దళ్ నాయకులు నివాళులర్పించారు. ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన చేశారు. మేడ్చల్ జిల్లా అర్బన్ యువమోర్చ అధ్యక్షుడు చల్ల ప్రభాకర్, బజరంగ్‌దళ్ మహంకాళి విభాగం కన్వీనర్ ముప్పు సుమంత్, సాకేత్, అరుణ్, సాకేత్‌గౌడ సాయిప్రణీత్, వేణు, అభియాదవ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు తదితరులు

ఉప్పల్: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటేనే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టగలమని డీసీపీ ట్రాఫిక్–1 రాచకొండ కె.మనోహర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసాన్ని పురస్కరించుకుని చివర రోజైన బుధవారం ఉప్పల్ నాలెడ్జ్ పార్కు వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిని ఆపి వారికి ఫైన్ వేయకుండా గులాబీ పూలను అందజేసి క్షేమంగా ప్రయాణించాలని సూచించారు. డీసీపీ మాట్లాడుతూ జరిమాన కోసం కాదని తన భద్రత, కుటుంబ క్షేమం కోసం ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు సేఫ్టీ ఏసీపీ ఎస్ఎన్ జావీద్, మల్కాజిగిరి ఏసీపీ ఎస్.శ్రీనివాసరావు, ఎఫ్ఎంసీ టెక్నిప్ ఎండీ అర్జున్ రుమాలా, నరేందర్, ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్ యాదవ్, ఇన్‌స్పెక్టర్లు కె.నాగరాజు, ప్రదీప్ బాబు, జోసెఫ్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేనంటే.. నేనే..!

లోక్‌సభ సీటుపై కన్నేసిన నాయకుల్లో పోటాపోటీ

- కోడ్ కూయలే.. అభ్యర్థిత్వం ఖరారు కాలేదు..
- నియోజకవర్గంలో ప్రచారంలోకి ఆశావహులు
- ఫ్లెక్సీలు, ప్రచార రథాలు, వాల్ రైటింగ్‌లు
- మరోపక్క సీటుపై స్థానిక నేతల లోకల్ నినాదం

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నుంచి ఆశావహుల తాకిడి అధికంగా ఉంది. పార్టీ అధిష్టానం అభ్యర్థుల జాబితా తయారీలో తలమునకలై.. గెలుపు గుర్రాల ఎంపికపై కసరత్తు ముమ్మురం చేస్తున్న నేపథ్యంలోనే.. ఈ లోక్‌సభపై కన్నేసిన ఆశావహులు తమకే టికెట్ ఖరారైనట్లుగా.. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార ఆర్భాటంలో భాగంగా ఫ్లెక్సీల ఏర్పాటు, గోడలపై వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మరికొందరైతే.. మరో అడుగు ముందుకేసి వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు ఎన్నికల ప్రచార రథాలను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో తిప్పుతున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయక ముందే.. పలువురు నేతలు ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా కార్యక్రమాలను చేపట్టడంపై ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

- ఇటీవల ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసంలో లోక్‌సభ అభ్యర్థుల విషయమై రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్, డీకే అరుణ, మురళీధర్‌రావు, బండి సంజయ్, ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, జితేందర్‌రెడ్డి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సమావేశమయ్యారు. ఇందులో రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల దరఖాస్తులను పరిశీలించగా, ఇందులో మల్కాజిగిరి స్థానానికి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు గ్రహించారు. ఈ సీటు కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ పడుతున్నారు. తనకున్న ప్రజాదరణ, రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి సీటు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే, ఇదే సీటును మురళీధర్‌రావు ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా తనకున్న జాతీయ స్థాయి అనుభవం, పార్టీకి అంకితభావంతో పనిచేయడం పరిగణనలోకి తీసుకుని పోటీకి అవకాశం ఇవ్వాలని ఈయన అడుగుతున్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య కూడా ఈ సీటును కోరుతున్నారు. ఈ సీటుపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థిత్వం ఖరారు నిర్ణయాన్ని అధిష్టానానికి అప్పగించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



పోటాపోటీగా ఆశావహుల హల్‌చల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ ఉండగా, ఇటీవల జరిగిన శాసనసభా ఎన్నికల్లో అంతటా బీఆర్‌ఎస్ విజయం సాధించగా, బీజేపీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభం జనంతో సులభంగా.. మల్కాజిగిరిలో బీజేపీ గెలుస్తుందన్న ధీమా ఉండటం వల్ల.. ఈ సీటుపై ఆశావహుల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆశావహులు పార్టీ అధిష్టానంతోపాటు ప్రజల అభిమానాన్ని చూరగొనేందుకు.. ఎన్నికల ప్రచార ఆర్భాటానికి తెరలేపినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే టికెట్ ఆశిస్తున్న ఆశావహులందరూ గోడలపై వాల్ రైటింగ్‌కు శ్రీకారం చుట్టారు. మరికొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు పోస్టర్లు కూడా అంటిస్తున్నారు. పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అయితే.. ఏకంగా ఎన్నికల ప్రచార రథాలనే నియోజకవర్గం పరిధిలో ప్రచారానికి తిప్పుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడలేదు.. పైగా పార్టీ అధిష్టానం కూడా అభ్యర్థుల జాబితాను ఖరారు చేయలేదు. ఆశావహులు మాత్రం ఎన్నికల పోటీకి సిద్ధమవుతుండటంతో పాటు పలు కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లడం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

స్థానిక పార్టీ నేతల్లో లోకల్ నినాదం..

మల్కాజిగిరి పార్లమెంట్ సీటుపై స్థానిక పార్టీ నాయకులు తీసుకుచ్చిన లోకల్ నినాదం కూడా కేడర్‌లో చర్చనీయాంశం అవుతోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య గురిపెట్టి ఎన్నికల ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో స్థానిక నేతలు కలవరానికి గురవడంతో పాటు లోకల్ నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ.. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం.. మరికొందరు నాయకులు ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం వంటి విషయాలు స్థానిక నాయకుల లోకల్ నినాదానికి కారణంగా చర్చ సాగుతోంది. ఏది ఏమైనా.. అభ్యర్థుల జాబితా ఖరారు కాకముందే.. ఆశావహులు మల్కాజిగిరి నియోజకవర్గంలో తామే అభ్యర్థి అన్నట్లుగా ఎన్నికల ప్రచార ఆర్భాటానికి వెళ్లటం ఈ రచ్చకు కారణమవుతోంది. స్థానిక పార్టీలో నెలకొన్న అయోమయం, లోకల్ చర్చ తదితర అంశాలకు అధిష్టానం ఏవిధంగా తెరదింపుతుందో వేచి చూడాల్సిందే..

జన్మదిన వేడుకలు



అల్వాల్: హెలెన్ కెల్లెర్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు, 39 సంవత్సరాలుగా మూగ, చెవిటి బధిర విద్యార్థులకు సేవలు అందిస్తున్న పఠాన్ ఉమర్‌ఖాన్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వసంత పంచమి వేడుకలు

అల్వాల్: సైనిక్‌పురి శృంగేరి శంకర మఠంలో కొలువుదీరిన శారదాంబకు వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీచక్రానికి తేనెతో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. బుధవారం అమ్మవారు వీణా శారదా మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సరస్వతీ పూజలు, చండీ, సరస్వతి హోమాలు నిర్వహించారు.

ఘనంగా శ్రీపంచమి పర్వదినం



మల్కాజిగిరి: అనంత సరస్వతీ నగర్‌లోని జ్ఞాన సరస్వతీ దేవాలయంలో శ్రీపంచమి పర్వదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకం, అలంకారం, అర్చన అనంతరం సరస్వతీ హోమం, సామూహిక అక్షరాభ్యాసం, సాయంత్రం పల్లకీ సేవ, ఊయల సేవ నిర్వహించామని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. అర్చకులు రాజశేఖరశర్మ, సాయి నిర్వహించారు.

డేంజర్.. జల్

- కాల్వలో పారుతున్నది మురుగు కాదు గరళమే..
- సాక్షి కథనానికి కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- నాలాలో నీటి పరీక్షల్లో తేలిన కఠోర వాస్తవాలు



రామ చెరువు నుంచి నాలా ద్వారా ఉప్పల్ నల్ల చెరువుకు చేరుతున్న వ్యర్థాలు

ఉప్పల్: ఈ నెల 6వ తేదీన నిర్లక్ష్యాన్ని ఏమ'నాలా'? శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలుష్యం వెదజల్లుతున్న నాలాలో పొల్యూషన్ బోర్డు అధికారులు నీటి శాంపిల్స్‌ను సేకరించారు. బోడుప్పల్ పరిధిలోని కొన్నిచోట్ల ఉప్పల్ జీహెచ్‌ఎంసీ పరిధిలో పలుచోట్ల అధికారులు శాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షలకు పంపారు. ఫలితంగా కఠోరమైన వాస్తవాలు బయటపడ్డాయి. ప్రశాంతమైన కాలనీల్లో భయంకరమైన కాలుష్యపు నీరు ప్రవహిస్తోందని, దీంతో కాలనీలవాసులు కాలుష్యం భారిన పడుతున్నాయని నిర్ధారించారు.

- మల్లాపూర్, నాచారం, చర్లపల్లి తదితర పరిశ్రమల ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వ్యర్థాలను కొందరు స్వార్థపూరితమైన పరిశ్రమల యాజమానులు నిర్లక్ష్యంగా బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని రామ చెరువులోకి, నాలాల్లోకి, మరికొంత భూగర్భ మురుగు కాల్వల్లోకి వదులుతున్నారని, ఆ వ్యర్థాలు ఉప్పల్ నల్ల చెరువుకు చేరుకుంటున్నాయని, దీంతో చెరువులు కూడా నాశనమయ్యే ప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.
- ముఖ్యంగా శ్రీరామనగర్, రాఘవేంద్రానగర్, హేమానగర్, బోడుప్పల్ ద్వారకానగర్, బాలాజీహిల్స్, జ్యోతినగర్, మల్లికార్జుననగర్, చిలుకానగర్ తదితర ప్రాంతాలకు తీవ్రంగా కాలుష్య ముప్పు ఏర్పడిందని అధికారులు భావించారు. ఈ కాలనీల్లో నాలా పరివాహక ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన, ఇంట్లో ఉండలేనంతగా ఘాటైన వాసనలు వస్తున్నాయని తేల్చారు.
- భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్లు గుర్తించారు. నాలాలో బ్రౌన్ కలర్ పారిశ్రామిక వ్యర్థాలు, మరోసారి తెల్లటి నీరు ఇలా అనేక రకాల కెమికల్ వ్యర్థాలు వస్తున్నాయని గుర్తించారు. కొన్ని పరిశ్రమలు సరిగ్గా వ్యర్థాలను శుద్ధి చేయకుండానే నేరుగా డ్రైనేజీ పైపుల్లోకి వదులుతున్నారని, దీని వల్ల పెను ప్రమాదం పొంచి ఉందని కూడా వారు తేల్చారు.
- ఇప్పటికే వందలాది మంది స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని వారు గుర్తు చేశారు. రిపోర్టుల ఆధారంగా వెంటనే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు, సీఈఈ టీఎస్‌పీసీబీ సనత్‌నగర్ కార్యాలయ అధికారులకు, జోనల్ కార్యాలయాలకు, మల్లాపూర్, నాచారం పారిశ్రామిక వాడల కమిషనర్లకు, పారిశ్రామికవాడల అసోసియేషన్లను అప్రమత్తం చేస్తూ తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్–1 రంగారెడ్డి జిల్లా అధికారులు ఫిర్యాదులు చేశారు.

బోడుప్పల్ కమిషనర్‌గా రామలింగం



బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా జి.రామలింగం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి జీహెచ్‌ఎంసీకి బదిలీ కావడంతో ఆ స్థానంలో జవహర్‌నగర్ కమిషనర్ రామలింగంకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రామలింగం మాట్లాడుతూ పాలకవర్గం, ప్రజల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. అన్ని శాఖల అధికారులు నూతన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

సరస్వతి దేవిని ఆరాధిస్తే విజ్ఞానం



రామంతాపూర్: చిన్న చెరువు గ్రౌండ్‌లో బుధవారం సరస్వతి పూజ సమితి ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా నిర్వహించిన సరస్వతి మాత జయంతి వేడుకల్లో హోమం, చిన్నారులకు అక్షరాభ్యాసం వంటి ప్రత్యేక పూజలకు బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణీ వెంకటరావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరస్వతి దేవిని ఆరాధిస్తే విజ్ఞానం లభిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం సరస్వతి దేవి పూజ నిర్వహిస్తున్న సమితి సభ్యులను వారు అభినందించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా సమితి ప్రతినిధులు రాంప్రకాష్ గుప్తా, సురేష్ సింగ్, భగవన్ సింగ్, మంజునాథ్ గుప్తా, సునీల్ కుమార్, కమలేష్ పాండే, అజయ్ శర్మ, ధర్మేందర్‌రాజు రాయ్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కుషాయిగూడ: ఆల్ ఇండియా వాటర్ ట్రీట్‌మెంట్ అసోసియేషన్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఈఎంటీఏ) నూతన సంవత్సర డైరీని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు కె.రాము యాదవ్, సెక్రటరీ బబ్బూరి బాలరాజుగౌడ్ హాజరై డైరీని ఆవిష్కరించారు. అనంతరం తమ ఉత్పత్తులపై మార్కెట్‌లో స్థితిగతులపై చర్చించారు. గత నెలలో జరిగిన స్పోర్ట్స్ మీట్ గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గిరిధర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, నవీన్, అక్రమ్, మల్లేష్‌యాదవ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో డివిజన్‌వాసుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో కలిసి జన్మదిన వేడుకలకు హాజరై శాలువాతో సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ దర్గా దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ కేంద్రంలో విద్యార్థులకు పరీక్షలు



సెట్విన్ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ..

మేడిపల్లి: తెలంగాణ యూత్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సెట్విన్ సెంటర్‌లో వివిధ వృత్తి, విద్యానైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు బుధవారం పరీక్షలను నిర్వహించారు. సెట్విన్ శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, ఏసీ, మొబైల్ రిపేరింగ్, మగ్గం వర్క్, జ్యూట్, పేపర్ బ్యాగ్స్ మొదలైన కోర్సుల్లో శిక్షణ పొందిన సుమారు 250మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఇన్‌చార్జి వనజ తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. వచ్చేవారం నుంచి కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు.

అభినందనలు



అల్వాల్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కమాండర్ వీఎం.రెడ్డి అన్నారు. అల్వాల్ పరిధిలోని పల్లవీ మోడల్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీహరి బివోమ్ ఇటీవల జనవరి 26న దేశ రాజధానిలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడకల్లో ప్రతిభ చాటిన సందర్భంగా సన్మాంచారు.

'బబుల్జ్'లో వసంత పంచమి వేడుకలు



ఉప్పల్: ఉప్పల్ బబుల్జ్ స్కూల్‌లో వసంత పంచమి దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సరస్వతి పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా సరస్వతిని పూజించుకోవడం ఆనవాయితీగా వస్తోందని ప్రతి సంవత్సరం విద్యార్థులతో ఈ ఉత్సవాన్ని జరుపుకుంటామని పాఠశాల కరస్పాండెంట్ చందనా శ్రీనివాస్ తెలిపారు.

ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు

కుషాయిగూడ: కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌ను కాప్రా సర్కిల్‌కు చెందిన పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఘనంగా సత్కరించి యాదగిరి లక్ష్మీనర్సింహ్మస్వామి ప్రసాదాన్ని అందజేశారు.

ఆనంద్‌బాగ్‌లో స్టేషన్ ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ సమీపంలో హాల్టింగ్ రైల్వే స్టేషన్ నిర్మాణంపై రైల్వే అధికారులు దృష్టి సారించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు, ట్రావెలర్స్ అసోసియేషన్ కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. త్వరలోనే చర్లపల్లి టర్మినల్ ప్రారంభం కావడంతో పాటు మౌలాలి నుంచి లింగంపల్లికి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం కానుండటంతో ఆనంద్‌బాగ్‌లో స్టేషన్ ఏర్పాటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చర్లపల్లి నుంచి దయానంద్‌నగర్ మీదుగా మేడ్చల్, ఆనంద్‌బాగ్, నేరేడ్‌మెట్ మీదుగా లింగంపల్లికి ప్రయాణికులు చేరుకోవడం సులభతరం అవుతుందన్నారు. చర్లపల్లి నుంచి విజయవాడ వైపు వెళ్లే రైళ్లనే కాకుండా కర్నూల్ మీదుగా వెళ్లే రైళ్లను కూడా ప్రారంభిస్తే సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్ల వద్ద రద్దీ తగ్గుతుందన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఉప్పల పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

ఉప్పల్: 16వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఉప్పల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఉప్పల్ పారిశ్రామికవాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికచట్టాలు, రైతు చట్టాలను తీసుకొచ్చి కార్మికుల, రైతుల నడ్డి విరిచిందని, అందుకు మోదీ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని నాయకుడు జె.వెంకన్న, వెంకటేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఐటీయూసీ నాయకులు పరమేష్, బీఆర్‌టీయూ నేత బూరుగు మారుతి రావు, తిప్పని సంపత్ కుమార్, ఐద్వా మహిళా నాయకురాలు ఎం.వినోద, సీపీఎం సర్కిల్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.